# బీసీ కులగణనపై గన్‌పార్క్ వద్ద నిరసన

-కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, మే 10 ( హంసకలం వార్త )

దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణనను తప్పనిసరిగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన ఈ ఆందోళనలో పలువురు నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగణనలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గణన నిర్వహిస్తూ బీసీలను విస్మరించడం అన్యాయమని నాయకులు ఆరోపించారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కులు కల్పించాలంటే కులగణన తప్పనిసరిగా చేపట్టాలని





పేర్కొన్నారు. బీసీ వర్గాల అసలు జనాభా వివరాలు వెలుగులోకి వస్తేనే వారికి తగిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ నిరసనలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, బీసీ జేఏసీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ కులగణనపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఈ ఆందోళనలో బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గన్‌పార్క్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది..

# కుత్బుల్లాపూర్‌లో పేదలకు అండగా సహాయనిధి

-కుత్బుల్లాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల జాతర..

-103 మందికి రూ.33 లక్షల ఆర్థిక సాయం..

-వివేకానంద్ చొరవతో లబ్ధిదారుల్లో ఆనందం..

-డివిజన్ వారీగా భారీగా చెక్కుల పంపిణీ..

కుత్బుల్లాపూర్, మే 10 ( హంసకలం వార్త )

కుత్బుల్లాపూర్ ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.33,17,500 విలువైన 103 సీఎంఆర్ఎఫ్ చెక్కులను చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ డివిజన్ల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. 125 డివిజన్‌కు చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ.2,95,500 విలువైన సహాయనిధి అందజేశారు. ఈ కార్యక్రమంలో పరుశ శ్రీనివాస్ యాదవ్, కస్తూరి బాలరాజు, కమలాకర్, నవాబ్ పాల్గొన్నారు. 126 డివిజన్‌కు చెందిన 10 మంది లబ్ధిదారులకు రూ.3,37,500 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. జగన్, రుద్ర అశోక్, వేణు యాదవ్, సాజిద్, బ్రహ్మానంద చారి పాల్గొన్నారు. 127 డివిజన్‌కు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.3,76,500 సహాయం అందజేశారు. సుధాకర్, ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, కార్తీక్ గౌడ్ పాల్గొన్నారు. 128 డివిజన్‌కు చెందిన 9 మంది లబ్ధిదారులకు రూ.2,81,000 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. మక్సూద్ అలీ, బసవరాజు, ఆకుల ప్రభాకర్ గుప్తా, కేపీ వెంకటేష్, కర్నెకంటి మల్లేష్, సామ్రాట్ పాల్గొన్నారు. 129 డివిజన్‌కు చెందిన 14 మంది లబ్ధిదారులకు రూ.4,68,500 సహాయనిధి అందజేశారు. మంత్రి సత్యనారాయణ, పుప్పాల భాస్కర్, సిద్దిక్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీను, ప్రభుదాస్, అను పాల్గొన్నారు. 130 డివిజన్‌కు చెందిన 6 మంది లబ్ధిదారులకు రూ.1,76,000 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. సురేష్ రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, కోల శ్రీకాంత్ ముదిరాజ్ పాల్గొన్నారు. 131 డివిజన్‌కు చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.2,43,000 సహాయం అందజేశారు. దేవరకొండ శ్రీనివాస్, సత్తి రెడ్డి, కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య, నసీరుద్దీన్, రమణారెడ్డి, రాకేష్ జాలిగం, మధుకర్ రెడ్డి పాల్గొన్నారు. 132 డివిజన్‌కు చెందిన 7 మంది లబ్ధిదారులకు



రూ.2,02,500 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కిషన్ రావు, కుంట సిద్ధిరాములు, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లా గౌడ్, సమ్మయ్య నేత, కాలే గణేష్, బాల మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, జోయెల్, సృజన్ పాల్గొన్నారు. నిజాంపేట, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.6,17,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సన్న కవితా శ్రీశైలం యాదవ్, ధనరాజ్ యాదవ్, ఆగం రాజు, జక్కుల క్రిష్ణ యాదవ్, అలుగారి సత్యనారాయణ, కొమురయ్య యాదవ్, బండారి మహేష్, వీరేష్, సద్దాం పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# సైబరాబాద్‌లో వీకెండ్ డ్రైవ్.. భారీ పట్టివేత


-మత్తులో డ్రైవింగ్ చేస్తే జైలు ఖాయం

సైబరాబాద్, మే 10 ( హంసకలం వార్త )

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారాంత ప్రత్యేక తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై ఉక్కుపాదం మోపారు. భారీ స్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో 137 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. పట్టుబడ్డ వారిలో 113 మంది ద్విచక్ర వాహనదారులు, 5 ఆటో డ్రైవర్లు, 18 కార్ల డ్రైవర్లు, ఒక భారీ వాహన డ్రైవర్ ఉన్నారు. రక్తంలో మద్యం శాతం ఆధారంగా పరిశీలిస్తే 105 మంది స్వల్ప మత్తులో, 18 మంది అధిక మత్తులో, 14 మంది తీవ్ర మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరందరినీ న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్లు పోలీసులు వెల్లడించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని పోలీసులు



హెచ్చరించారు. మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైతే భారతీయ న్యాయ సంహిత--2023లోని సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ నేరానికి గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. గత వారం నమోదైన డ్రంక్ డ్రైవింగ్ కేసుల్లో 198



కేసులను న్యాయస్థానాలు పరిష్కరించగా, పలువురికి జైలు శిక్ష, సామాజిక సేవ, జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు..

# ఇంటర్ రద్దుకు బ్రేక్.. ప్రవేశాలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, మే 10 ( హంసకలం వార్త )

తెలంగాణలో ఇంటర్మీడియట్ వ్యవస్థ రద్దు ప్రతిపాదనకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ విద్యా సంవత్సరంలో యథావిధిగా ఇంటర్ ప్రవేశాలు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రవేశాల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసి 11, 12 తరగతులుగా అమలు చేయాలన్న ఆలోచనపై ప్రభుత్వం ఇటీవల చర్చలు జరిపింది. అయితే సాంకేతిక సమస్యలు, ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సమాచారం. ప్రవేశాల నిలిపివేతపై వెలువడిన ప్రకటనతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొనడంతో ప్రభుత్వం వెంటనే స్పందించింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇంటర్ ప్రవేశాలు కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. పదో తరగతి తర్వాత చదువు మానేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని విద్యా విభాగం గుర్తించింది. ఇంటర్మీడియట్ వ్యవస్థ వేరుగా ఉండటమే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో 11, 12 తరగతులు పాఠశాల విద్యలోనే కొనసాగుతున్న నేపథ్యంలో తెలంగాణలో కూడా అదే విధానం అమలు చేసే అంశంపై చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించిన




అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం..

## బేగంపేట్‌లో కాంగ్రెస్ కార్యాలయ ప్రారంభం

-సేవే నాయకుడి అసలైన గుర్తింపు..బండి రమేష్..

బేగంపేట్, మే 10 ( హంసకలం వార్త )



ప్రజల్లో నిరంతరం ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడికే గౌరవం, గుర్తింపు లభిస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. బేగంపేట్ డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. బండి రమేష్ జన్మదినం సందర్భంగా నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వ హక్కులు అందేలా రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహోన్నత దార్శనికుడని కొనియాడారు. దళిత రత్న అవార్డు గ్రహీతలను అభినందించారు. పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న నాయకుల సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, కరుణాకర్, సురేష్, పర్వేజ్, అలీ భాయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు..

## కుటుంబ బంధాలకు వేదికైన బండారి సమ్మేళనం

-కుటుంబ విలువలు కాపాడాలి: ఎమ్మెల్యే వివేకానంద్..



కొంపల్లి, మే 10 ( హంసకలం వార్త )

సిఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధిలోని ఆదిత్య ఉత్సవ్ బ్యాంక్విట్ హాల్‌లో బండారి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ సమ్మేళనాలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే వేదికలుగా నిలుస్తాయని అన్నారు. బిజీ జీవితంలో కుటుంబ సభ్యులు, బంధువులు ఒకచోట చేరి ఆత్మీయంగా కలుసుకోవడం ఆనందాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో కుటుంబ విలువలపై అవగాహన పెంచడంతో పాటు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. సమాజ అభివృద్ధికి ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే సామాజిక బలపాటు సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. బండారి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దశరథ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఖజాంచి మల్లేష్, బిఆర్ఎస్ నాయకులు వారాల వినోద్ కుమార్, రాజకుమార్ ముదిరాజ్, మైసా గౌడ్, వేణు ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

## శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ శక్తి ప్రదర్శన

-బూత్ వార్‌కు కాంగ్రెస్ సిద్ధం

-బూత్ బలమే కాంగ్రెస్ గెలుపు..

-కార్యకర్తలే కాంగ్రెస్‌కు అసలైన బలం..

-కాంగ్రెస్ గెలుపే లక్ష్యం..నాయకుల పిలుపు..

శేరిలింగంపల్లి, మే 10 ( హంసకలం వార్త )



రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ఇంచార్జి ఎంపీ మల్లు రవి ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నల్లగండ్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో నాయకులకు కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. 2023 సాధారణ ఎన్నికల్లో పార్టీ తనకు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభ్యర్థిత్వం కల్పించిందని, వి. జగదీష్ గౌడ్ తక్కువ సమయంలోనే కార్యకర్తల కృషితో లక్షా పది వేలకుపైగా ఓట్లు సాధించగలిగామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో జరిగిన లోపాలను సరిదిద్దుకుని గ్రామ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయాలని, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెరగాలని సూచించారు. ప్రజల సమస్యలు, అవసరాలు, సంక్షేమానికి అవసరమైన మౌలిక సదుపాయాలపై కార్యకర్తలకే పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. 2028 సాధారణ ఎన్నికల్లో శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కింది స్థాయి నుంచి కష్టపడి పనిచేసిన వారికే పార్టీలో గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. బూత్ స్థాయిలో కార్యకర్తలు సమర్థంగా పనిచేస్తేనే అభ్యర్థి విజయం సాధించగలడని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి బూత్‌లో ఓటు హక్కు కలిగిన వారినే ప్రతినిధులుగా నియమించాలని, ఒక్క కుటుంబం నుంచి ఒక్కరికే అవకాశం ఇవ్వాలని తెలిపారు. అలాగే ప్రతి బూత్ పరిధిలోని వెయ్యి నుంచి పన్నెండు వందల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి మద్దతు కూడగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు..

